# ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

- ఆద్యంతం పర్యవేక్షించిన కలెక్టర్
- గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల అందజేత
- కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా సాగిన ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు చేపడుతున్న ఎన్నికల సిబ్బంది

ఖలీల్‌వాడి, డిసెంబర్ 3 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో చివరి అంకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిధిలోని ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, అర్బన్, రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను.. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ లెక్కించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి కౌంటింగ్ ప్రక్రియను ఆద్యంతం పర్యవేక్షించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రకియ సాఫీగా పూర్తయ్యింది. ఉదయం 5 గంటల నుంచే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారం సిబ్బందికి ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు అప్పగించారు. ముందుగా పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను లెక్కించిన మీదట, ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. మధ్యాహ్నం సమయానికే సుమారు ఆరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ, అన్ని అంశాలను సరి చూసుకున్న అనంతరం రిటర్నింగ్ అధికారులు ఫలితాలను వెల్లడిస్తూ.. గెలుపొందిన అభ్యర్థులకు పరిశీలకుల సమక్షంలో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పైడి రాకేశ్‌రెడ్డి (బీజేపీ)కి రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్, బోధన్ నుంచి గెలుపొందిన పి.సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్)కి రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్, బాన్సువాడ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్)కి ఆ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి భుజంగరావు, నిజామాబాద్ అర్బన్ నుంచి గెలుపొందిన ధన్‌పాల్ సూర్యనారాయణ(బీజేపీకి)కి రిటర్నింగ్ అధికారి మకరంద్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆర్.భూపతిరెడ్డి (కాంగ్రెస్)కి రిటర్నింగ్ అధికారి రాజేంద్ర కుమార్, బాల్కొండ నియోజకవర్గం నుంచి గెలిచిన వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్ఎస్)కి ఆ సెగ్మెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితోపాటు ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వెబ్‌క్యామ్ ద్వారా పర్యవేక్షించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఏడీఏ తోట రాజశేఖర్ నేతృత్వంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా జిల్లాలో ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాతీర్పును శిరసావహిస్తా..

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం.. ఎన్నో ఒడిదుడుకులు చూశా..
- నా కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు
- నేను, జగన్ ఎప్పటికీ మీ వెంటే ఉంటాం.. మనోనిబ్బరం కోల్పోవద్దు
- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



డిచ్‌పల్లి, డిసెంబర్ 3 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు విడుదలైన అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తన కోసం రాత్రింబవళ్లు పనిచేసిన ప్రతి కార్యకర్తకూ, ఓటేసిన ప్రజలతో పాటు అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. తాను, తనకుమారుడు, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామని, కార్యకర్తలు, అభిమానులు మనోనిబ్బరం కోల్పోవద్దని సూచించారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు చూశానని, గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో మూడుసార్లు టికెట్ ఇచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎప్పుడూ చూడని, చేయని విధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ ఫలాలను అందించానని తెలిపారు. ప్రజలు తమ కన్నా కాంగ్రెస్ పాలనలో ఇంకా ఎక్కువ సంక్షేమం అందుతుందని భావించి, ఆ పార్టీని గెలిపించుకున్నారని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ ప్రజల మనిషిగానే, ప్రజా లీడర్‌గానే నడుచుకున్నానని, ఎక్కడా ఎలాంటి పొరపాటు చేయలేదని.. అది ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు ప్రజలకు అందివ్వాలని, ఎక్కువ అభివృద్ధి చేసి చూపాలని పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజలకు అందేలా పోరాడుతానని తెలిపారు.

## ప్రజల నమ్మకాన్ని మమ్ము చేయను

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



రూరల్ నియోజకవర్గ ప్రజలు తనను నమ్మి గెలిపించి అసెంబ్లీకి పంపుతున్నారని, వారి నమ్మకాన్ని మమ్ము చేయకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. తనను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించడంతో బాధ్యత మరింత పెరిగిందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. తన గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని, వారితో పాటు పార్టీ టికెట్ ఇచ్చిన అధిష్టానానికి, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కృషిచేస్తామన్నారు.

## అర్బన్‌లో బీజేపీ విజయం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 3 : అర్బన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా విజయం సాధించారు. మొత్తం 21 రౌండ్లు సాగిన ఓట్ల లెక్కింపులో మొదట కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ షబ్బీర్ అలీ ఆధిక్యత ప్రదర్శించినా.. తర్వాత బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. అర్బన్‌లో మొత్తం 21 మంది బరిలో నిలిచారు. నిజామాబాద్ అర్బన్‌లో మొత్తం 2,86,266 ఓటర్లు ఉండగా.. 1,81,808 ఓట్లు పోలయ్యాయి. 21 రౌండ్ ముగిసే సరికి బీజేపీ అభ్యర్థి సూర్యనారాయణ గుప్తా 73,724 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా.. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ షబ్బీర్ అలీ 59104 రెండో స్థానంలో, 44,598 ఓట్లతో బిగాల గణేశ్ గుప్తా మూడో స్థానంలో నిలిచారు. ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా 14,620 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## ఇది నా విజయం కాదు.. ప్రజల విజయం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



ఖలీల్‌వాడి, డిసెంబర్ 3 : అర్బన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా గెలుపొందారు. గెలుపొందిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ విజయం తనది కాదని.. ప్రజలదని అన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించడం తన అదృష్టమని ధన్‌పాల్ వెల్లడించారు. అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. తనను గెలిపించేందుకు కృషిచేసిన కార్యకర్తలు, అర్బన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా 14,620 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## రూరల్‌లో కాంగ్రెస్ విజయం

- బాజిరెడ్డికిపై డాక్టర్ భూపతిరెడ్డి గెలుపు

డిచ్‌పల్లి, డిసెంబర్ 3 : రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి విజయం సాధించారు. గత నెల 30న జరిగిన పోలింగ్‌కు సంబంధించి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 21 రౌండ్లు సాగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే తన సమీప ప్రత్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై భూపతిరెడ్డి పూర్తి ఆధిక్యం ప్రదర్శించి.. 21,621 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 8వ రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి స్వల్ప మెజార్టీ (556 ఓట్లు) సాధించారు. 10వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్‌కుమార్ స్వల్ప మెజార్టీ (181 ఓట్లు ) సాధించారు. మిగిలిన అన్ని రౌండ్లలో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులపై కాంగ్రెస్ అభ్యర్థి స్పష్టమైన మెజార్టీ సాధించారు. రూరల్ నియోజకవర్గంలో మొత్తం 293 పోలింగ్ కేంద్రాలుండగా 2,53,233 ఓట్లకు గాను 193,510 ఓట్లు పోలయ్యాయి. వీటిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 56,102 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్‌కుమార్‌కు 49,268 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డికి 77,723 ఓట్లు వచ్చాయి. అయితే బీజేపీ అభ్యర్థి దినేశ్‌కుమార్ సిట్టింగ్ ఎమ్మెల్యే బాజిరెడ్డికి దీటుగా ఓట్లు రావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. నిజామాబాద్ రూరల్ బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు మొత్తం 14 మంది బరిలో నిలబడ్డారు. బీఎస్పీ అభ్యర్థి మఠంల శేఖర్ 2,361 ఓట్లు సాధించగా.. నోటాకు 2,254 ఓట్లు పోలయ్యాయి.

## నా జీవితం నగర ప్రజలకు అంకితం

- బిగాల గణేశ్ గుప్తా



ఖలీల్‌వాడి, డిసెంబర్ 3 : ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయనిర్ణేతలని, వారి తీర్పును శిరసావహిస్తానని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పేర్కొన్నారు. ప్రజల సహకారంతో తొమ్మిదిన్నరేండ్లుగా నగరాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలకు పథకాలు అందించానని పేర్కొన్నారు. ఓడినా తన జీవితం నగర ప్రజలకు అంకితమని తెలిపారు.

## ప్రశ్నించే గొంతుకగా ఉంటా..

- బీజేపీ రూరల్ అభ్యర్థి కులాచారి దినేశ్

డిచ్‌పల్లి, డిసెంబర్ 3 : తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ రూరల్ ప్రజలు తనపై నమ్మకంతో సుమారు 50 వేల ఓట్లు వేసి ఆశీర్వదించడం సంతోషంగా ఉందని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ఉంటానని బీజేపీ రూరల్ అభ్యర్థి కులాచారి దినేశ్ కుమార్ అన్నారు. తనకు ఈ ఓట్లు రావడంతో కార్యకర్తల కృషి ఎంతో ఉందని, తనకు ఓటు వేసిన రూరల్ ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. 20 ఏండ్ల పాటు తన రాజకీయ గురువు మండవ వెంకటేశ్వర్‌రావుతో కలిసి పని చేశానని, ఈసారి ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపడం తన ఓటమికి ముఖ్య కారణమని భావిస్తున్నానన్నారు.

## పోచారం గెలుపునకు కృషిచేసిన వారికి కృతజ్ఞతలు



మోస్రా (చందూర్), డిసెంబర్ 3 : బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. పోచారం శ్రీనివాసరెడ్డి గెలుపునకు కృషిచేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంచి పనులు చేసే వారి వెంట ప్రజలు ఎల్లప్పుడూ ఉంటారని, ఈ విజయం ప్రజలదని పేర్కొన్నారు.

## కౌంటింగ్ సెంటర్ వద్ద కట్టుదిట్టమైన భద్రత

- జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమలు
- పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 3 : జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ పర్యవేక్షణలో నగరంలోని కంఠేశ్వర్ ఏరియాలోని పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి కిలోమీటర్ చుట్టుపక్కల ప్రజలు గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే ప్రతిఒక్కరినీ పోలీసులు మెటల్ డిటెక్టర్లతో తో తనిఖీలు నిర్వహించిన అనంతరమే లోపలికి అనుమతించారు.

నిర్మల్, ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోకి వచ్చే వాహనాలను కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు మీదుగా దుబ్బ ఏరియా నుంచి మళ్లించారు. నగరంలోని ధర్నా చౌక్ నుంచి కంఠేశ్వర్ వైపు వచ్చే వాహనాలను జిల్లా పరిషత్ రోడ్డు ఎదుట నుంచి సుభాష్‌నగర్ మీదుగా గౌతంనగర్, బైపాస్ రోడ్డు నుంచి మళ్లించారు. పోలీస్ గెస్ట్ హౌస్, సుభాష్‌నగర్ రామాలయం రోడ్లను పూర్తిగా మూసివేశారు. ట్రాఫిక్ మళ్లింపు కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రధాన చౌరస్తాలో బారికేడ్లను ఏర్పాటు చేసి, వాహనాలను డైవర్షన్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బీఎస్ఎఫ్, ఏఆర్, సివిల్ పోలీస్ బలగాలు బందోబస్తు చర్యలు చేపట్టాయి. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నది.



కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది